హోరాహోరీగా తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ నాలుగో సీజన్ రసవత్తరంగా సాగుతోంది. క్వార్టర్ ఫైనల్స్ లో 8 జట్లు నువ్వా నేనా అన్నట్టు తలపడ్డాయి. ఊహించని విధంగా లీగ్ స్టేజీలో టేబుల్ టాపర్‌గా నిలిచిన ఆటమ్ ఛార్జర్స్‌కు క్వార్టర్ ఫైనల్లో చుక్కెదురైంది. నాకౌట్ మ్యాచ్‌లో టీమ్ టీ ఆఫ్ ఫెయిర్ మౌంట్ ఛార్జర్స్ కు షాకిచ్చింది. 4-2 స్కోర్ తో సంచలన విజయం సాధించింది. టీమ్ దాసోస్ , వ్యాలీ వారియర్స్ మధ్య క్వార్టర్ ఫైనల్ టై కావడంతో ప్లే ఆఫ్‌లో కెప్టెన్ మాధవ్ కోట వ్యాలీ వారియర్స్‌ను గెలిపించాడు. అలాగే ఎంవైకే స్ట్రైకర్స్ పై రియిడ్ట్ మాస్టర్స్ గెలిచి మూడో సెమీస్ బెర్తును దక్కించుకోగా... చివరి క్వార్టర్ ఫైనల్లో గోల్డెన్ ఈగల్స్ టీమ్ అదరగొట్టింది. 4-2 స్కోర్ టీమ్ వైసాను ఓడించి సెమీస్‌లో అడుగుపెట్టింది. టీమ్ టీఆఫ్ ఫెయిర్ మౌంట్ , వ్యాలీ వారియర్స్, రియిడ్ట్ మాస్టర్స్, గోల్డెన్ ఈగల్స్ టీజీపీఎల్ నాలుగో సీజన్ సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి.

ఏఐఎన్‌యూ ఆధ్వర్యంలో హెల్త్ వాక్‌థాన్



హైటెక్‌సిటీ వద్ద హెల్త్ వాక్‌థాన్‌ను నిర్వహించిన ఏఐఎన్‌యూ ఆసుపత్రి సిబ్బంది

మాదాపూర్: పురుషుల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఆదివారం మాదాపూర్‌లోని హైటెక్‌సిటీ వద్ద హెల్త్ వాక్‌థాన్ నిర్వహించారు. ప్రపంచంలోని 112 దేశాలలో పురుషులలో ఎక్కువగా వచ్చే కేన్సర్‌లలో ప్రోస్టేట్ కేన్సర్ ఒకటని ఏఐఎన్‌యూ (ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ) ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సి.మల్లికార్జున అన్నారు. పురుషుల ఆరోగ్యం, వ్యాధి నివారణ చర్యలు , సకాలంలో స్క్రీనింగ్, చికిత్స ప్రాముఖ్యతపై అవగాహన కల్పించే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. 400 మందికి పైగా ఆరోగ్య ఔత్సాహికులు పాల్గొన్నారు. యువకులకు (15- 35) వృషణ కేన్సర్ ఎక్కువగా వస్తుందన్నారు. దీనిని ముందుగా గుర్తించడంతో బాటు సరైన చికిత్స ముఖ్యమన్నారు. ఒత్తిడితో కూడిన జీవనశైలి ,పురుషుల మానసిక, శారీరక ఆరోగ్యంపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. సీఈఓ సందీప్ మాట్లాడుతూ ప్రారంభదశలోనే రోగ నిర్ధారణ చేస్తే చికిత్స సులువు అని అన్నారు.

సందడిగా కార్తీక వన భోజనాలు



వన భోజన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, సంఘం సభ్యులు

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని నరేన్ గార్డెన్‌లో కమ్మ సంఘం పటాన్‌చెరు, బీహెచ్‌ఈఎల్ శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్ వారి ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన భోజన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ , రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మన్నే సతీష్ కుమార్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కమ్మ సంఘం సభ్యులు ఐక్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, డాక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు, చంద్రమౌళి, వెంకటేశ్వర్‌రావు, రవి, పాపారావు, శివ, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ ఆర్యవైశ్య ఐక్యవేదిక ఆధ్వర్యంలో..

మియాపూర్ డివిజన్ పరిధిలోని విశ్వనాథ్ గార్డెన్‌లో తెలంగాణ శ్రీవాసవి ఆర్యవైశ్య ఐక్యవేదిక శేరిలింగంపల్లి శాఖ ఆధ్వర్యంలో వన భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు గజ్జల యోగానంద్ గుప్తా, కార్పొరేటర్ శ్రీకాంత్, చందానగర్ డివిజన్ సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం సభ్యులు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్‌రావు గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రావు గుప్తా, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణగుప్తా, కోశాధికారి కోటేశ్వరరావు గుప్తా, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మియాపూర్-ఇస్నాపూర్ వరకు మెట్రోను విస్తరించాలి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావులకు వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందిస్తున్న మెట్రో సాధన సమితి సభ్యులు

పటాన్‌చెరు టౌన్: మియాపూర్ నుండి పటాన్‌చెరు మీదుగా ఇస్నాపూర్ వరకు మెట్రో రైల్‌ను విస్తరించాలని మెట్రోరైల్ సాధన సమితి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, సభ్యుల ఆధ్వర్యంలో కేంద్ర మంత్రివర్యులు కిషన్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావులకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఇస్నాపూర్ వరకు మెట్రో రైలును విస్తరించాలని ప్రతిపాదించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీఓలో పటాన్‌చెరు వరకు మాత్రమే ప్రతిపాదించిందని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే పారిశ్రామికవాడ ఇస్నాపూర్ వరకు మెట్రోను పొడగించాలని విన్నవించారు.ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి, ఎంపీ రఘురందన్‌రావులను కోరారు. కార్యక్రమంలో మెట్రో రైల్ సాధన సమితి సభ్యులు రుద్రారం శంకర్ , అబ్దుల్ బాసిత్, ఈర్ల రాజు ముదిరాజ్, మెట్టు శ్రీధర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు.. విచ్చలవిడిగా తవ్వకాలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు





మియాపూర్ ప్రశాంత్‌నగర్ కాలనీలో ఫుట్‌పాత్‌లను తవ్విన దృశ్యాలు

మియాపూర్: పాదచారులకు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు నిర్మించిన ఫుట్‌పాత్‌లు ధ్వంసమవుతున్నాయి. నగరంలో ట్రాఫిక్ సమస్య అధికం కావడంతో ప్రధాన రోడ్లపై పాదచారులు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలు జరగకుండా రోడ్లకు ఇరువైపులా రూ.లక్షలు వెచ్చించి ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారు. ఐతే కొంతమంది వ్యాపారస్తులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండగా, మరికొందరు ఏకంగా వారి స్వప్రయోజనాల కోసం వీటిని తవ్వి ధ్వంసం చేస్తున్నారు

◆ మియాపూర్‌లోని ప్రశాంత్‌నగర్ కాలనీ ప్రధాన రహదారిలో కొంతకాలం కిందట రోడ్డుకు ఇరువైపులా లక్షలాది రూపాయలతో ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారు. ఓ ప్రైవేటు సంస్థకు సంబంధించి విద్యుత్ స్తంభాల నిమిత్తం గుంతలు తవ్వారు.

◆ ఈ రోడ్డు వెంట మూలమలుపు వద్ద ఓ నిర్మాణం చేపట్టి కమర్షియల్ షట్టర్లు ఏర్పాటు చేశారు. ఇందులో టెంట్‌హౌస్ నిర్వహిస్తున్నారు. ఈ టెంట్‌కు సంబంధించిన సామగ్రి అంతా ఫుట్‌పాత్ పైనే ఉంచారు.

◆ అలాగే ఓ కారు సర్వీస్ సెంటర్ యజమాని కార్లు రావడానికి ఫుట్‌పాత్ అడ్డంగా ఉందంటూ దానిని తొలగించి వేశాడు.

◆ ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు అండగా ఉండడంతో పాటు అధికారులపై ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

◆ ఉన్నతాధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లను తవ్విన, ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన సంగీత కచేరి



మాదాపూర్: సంగీత కచేరీ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. మాదాపూర్‌లోని సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్, ట్రెనింగ్ సెంటర్)లో ఆదివారం పండిత్ జశ్‌రాజ్, 52వ పండిత్ మోతీరామ్, పండిత్ మనీరామ్ సంగీత్ సమారోహ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ కళాకారులు తమ కచేరీతో అలరించారు. కళాకారులు రేఖా భరద్వాజ్ సుఫీ, గార్గి సిద్ధాంత్, మధుశ్రీ నారాయణ్, రాధిక పారిఖ్, సప్తరిషి, మోహన్‌కుమార్, రాజీవ్ జనార్దన్, రోహిత్ కులకర్ణి, మయుక్‌సర్కా, సౌరభ్‌జోషి, భాస్కర్ జ్యోతిదాస్ తదితరులు అలరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ ప్రిన్సిపల్ జయేశ్‌రంజన్, మాజీ డీజీపీ అంజనీకుమార్ పాల్గొన్నారు.

సురభి కాలనీలో ఉచిత వైద్యశిబిరం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ సురభి కాలనీలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మెడికవర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో కంటి, దంత, బీపీ, షుగర్, బీఎండీ, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్స్ ఆదిత్య, నదీమ్, నగేష్‌గౌడ్‌లు వైద్య పరీక్షలు చేశారు. కాలనీ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్, నాయకులు చంద్రశేఖర్, జయకృష్ణ, భాను, జితేంద్ర, వెంకట్‌రెడ్డి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవస్థానంలో ఆదివారం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని భక్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పారాయణ కమిటీ సభ్యులు శేషాద్రి, హైకోర్టు న్యాయవాది సుంకరి మౌనిక ,న్యాయవాది నాగరాజు యాదవ్, రామచంద్రుడు, రవి, భజరంగదళ్ కార్యకర్తలు మనోజ్, శిరీష్ ,భరత్, సూరజ్, నాగరాజు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నరేష్, జగన్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్యార్వీ షరీఫ్ వేడుక

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఎల్లమ్మబండ ఎన్‌టీఆర్ నగర్‌లో మైనార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యార్వీ షరీఫ్ కార్యక్రమానికి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గచిబౌలి, జేవీ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

చందానగర్: వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ స్తంభాల తరలింపు, మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

◆ సురక్ష ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు విద్యానగర్, సురక్ష కాలనీ, పద్మజ కాలనీ, సత్య ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డి కాలనీ, అపర్ణ హెచ్‌టీ సర్వీసు ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ఫీడర్ల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

◆ 11కేవీ గుల్‌మొహర్ పార్కు ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గుల్‌మొహర్‌పార్కు కాలనీ, జీహెచ్‌ఎంసీ ఆఫీస్, అలిండ్ కంపెనీ, నేతాజీనగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

◆ 11 కేవీ బాపూనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు బాపూనగర్, నెహ్రూనగర్, గోపీనగర్‌లలో..

◆ 11 కేవీ నల్లగండ్ల హుడా కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నల్లగండ్ల మెయిన్ రోడ్డు, నల్లగండ్ల హుడా కాలనీల్లో ..

◆ 11 కేవీ లక్ష్మీవిహార్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లక్ష్మీవిహార్ ఫేజ్-1, ఫేజ్ -2 కాలనీలు, నల్లగండ్ల విలేజ్, డాక్టర్స్ కాలనీల్లో ..

◆ 11 కేవీ ఎఫిస్టిమో గ్లోబల్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎఫిస్టిమో గ్లోబల్ స్కూల్ ఏరియా, సాధన స్కూల్ ఏరియా, తెల్లాపూర్ రోడ్డులో..

◆ 11 కేవీ రాంకీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాంకీ అపార్టుమెంట్స్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

అట్టహాసంగా 'బ్రింగ్ యువర్ కిడ్స్ టు వర్క్ డే'



కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ ఉద్యోగుల పిల్లలు

రాయదుర్గం: హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్‌లో ప్రముఖ సంస్థగా గుర్తింపు పొందిన నానక్‌రాంగూడలోని ఏడీపీ ఇండియా ఆదివారం 'బ్రింగ్ యువర్ కిడ్స్ టు వర్క్ డే కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. సంస్థ వార్షిక వేడుకలలో భాగంగా 'వర్క్ స్పేసెస్ నుంచి ఔటర్ స్పేస్ వరకు కాస్మోస్ (విశ్వ) నేపథ్యంలో నిర్వహించిన వేడుకలో హైదరాబాద్, పూణే సంస్థల నుంచి 1800 మంది ఉద్యోగులు తమ పిల్లలను కార్యాలయాలకు తీసుకొచ్చారు. వారి కోసం మ్యాజిక్‌షో, ఇంటికి తీసుకెళ్ళడానికి అందమైన గూడీస్‌ను అందుబాటులో ఉంచారు.

తుంటి మార్పిడి శస్త్రచికిత్సలు పెరుగుతున్నాయి

డాక్టర్ పవన్ గోరుకంటి



మాదాపూర్: అధిక మోతాదులో స్టెరాయిడ్ వాడకం, గాయాల కారణంగా తుంటి మార్పిడి శస్త్రచికిత్సలు పెరుగుతున్నాయని యశోద ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి తెలిపారు. ఆదివారం మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో మొదటిసారిగా రివిజన్ హిప్ రీ ప్లేస్‌మెంట్ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్పిటల్‌లో నిర్వహించిన లైవ్ సర్జరీలు, కాన్ఫరెన్స్‌లోని హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్‌ల ద్వారా అధునాతన పద్ధతులు తెలుసుకోవచ్చన్నారు. తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్, ట్విన్ సిటీస్ ఆర్థోపెడిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఉదయ్‌కృష్ణ, దేశవ్యాప్తంగా దాదాపు 250 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో 50 పడకల ఆస్పత్రి కల నెరవేరేనా?

- ఆరోగ్య కేంద్రంలో అరకొర వసతులు
- నిధుల లేమితో పడకేసిన ప్రతిపాదన
- ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసినా కొరవడిన అభివృద్ధి
- రోగులకు తప్పని ఇబ్బందులు



శంషాబాద్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రం

శంషాబాద్: శంషాబాద్ సర్కారు దవాఖానా 50 పడకల అభివృద్ధిపై పలు సందేహాలు కలుగుతున్నాయి. అరకొర వసతుల నడుమ రోగులకు సేవలందిస్తున్న సర్కారు దవాఖానాకు మంచి రోజులు వస్తాయని ఆశించిన సమయంలో నిధుల విడుదల కాస్తా నిలిచిపోవడంతో నిరాశ ఎదురైంది.

వైద్యవిధాన పరిషత్‌లో విలీనమైనా..

శంషాబాద్ సర్కారు దవాఖానాను నాలుగేళ్ల క్రితం వైద్యవిధాన పరిషత్‌లో విలీనం చేశారు. రికార్డుల్లో ప్రభుత్వాస్పత్రిని అప్‌గ్రేడ్ చేసినా అందుకు సంబంధించి వసతులు కల్పించలేదు.

◆ నిధులు కూడా విడుదల చేయలేదు. కమ్యూనిటీ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినా ఈ దవాఖానాలో ప్రస్తుతం 10 పడకలు లోపే ఉన్నాయి.

◆ నిత్యం సుమారు 200 మంది వరకు ఔట్ పేషెంట్లు వైద్య సేవలు పొందుతున్నారు. సరిపడా బెడ్లు లేనందున ఇన్‌పేషెంట్లకు ఇబ్బందులు తప్పడం లేదు. కమ్యూనిటీ ఆస్పత్రి స్థాయిలో వైద్యుల నియామకమూ జరగలేదు.

గతేడాది ప్రతిపాదన..

వైద్యవిధాన పరిషత్ నుంచి అభివృద్ధికి నిధులు కేటాయించనందున రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ ఆదిశగా చర్యలు చేపట్టారు. హెచ్‌ఎండీఏ నుంచి మున్సిపాలిటీకి కేటాయించిన రూ. 50 కోట్ల నిధుల నుంచి 50 పడకల ఆస్పత్రికి రూ. 5.30 కోట్లు కేటాయించేందుకు ప్రతిపాదించారు. ఇందుకు సంబంధించిన డీపీఆర్ కూడా సిద్ధమైంది.

◆ అయితే హెచ్‌ఎండీఏ కేటాయించిన నిధులు పూర్తి స్థాయిలో విడుదల కాలేదు. దీంతో ఆస్పత్రి అభివృద్ధి ప్రతిపాదన కాస్తా మరుగున పడిపోయింది.

◆ నిధులు విడుదలైతేనే ఆస్పత్రి అభివృద్ధికి మోక్షం కలుగుతుందనడం నిర్వివాదాంశం. అప్పటి వరకు రోగులకు మాత్రం పాట్లు తప్పేలా లేవు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి నిధులు విడుదల తద్వారా ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రధానరోడ్డుపై భారీ గుంత

టీహబ్, టీ వర్క్స్ ఎదుట దెబ్బతిన్న రోడ్డు



హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్, టీవర్క్స్ ఎదుట రోడ్డు పరిస్థితి

రాయదుర్గం: అది ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం సమకూర్చిన ప్రాంతం. టీహబ్, టీవర్క్స్, జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఉండే ప్రాంతం. ఇక్కడ ప్రధాన రోడ్డుపై భారీ గుంత ఏర్పడినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాలెడ్జిసిటీలోని భూములు ఈ వేలంలో కోట్లాది రూపాయల ఆదాయాన్ని సమకూర్చిన ప్రాంతం. ఇలాంటి ప్రాంతంలో ప్రస్తుతం టీహబ్, టీవర్క్స్, పలు ఐటీ, ఇతర సంస్థలు, గేటెడ్ కమ్యూనిటీలు, స్టార్ హోటల్స్ కొనసాగుతున్న ప్రాంతంలో రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ రోడ్డును బాగుచేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తరచూ మంత్రులు కూడా టీహబ్, టీవర్క్స్‌లో నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన చోట రోడ్డును యుద్ధప్రాతిపదికన బాగుచేయాలని పలువురు కోరుతున్నారు.

సమగ్ర సర్వే 80 శాతం పూర్తి

ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి



ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

చందానగర్: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర కుటుంబ సర్వే 80 శాతం పూర్తి అయ్యిందని చందానగర్ సర్కిల్ 21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. చందానగర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో సర్వే పూర్తి అయిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేస్తున్న విధానాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 తుది గడువులోపు సర్వే, డేటా ఎంట్రీని పూర్తి చేస్తామన్నారు. సుమారు 100 మంది ఆపరేటర్ల సహాయంతో దరఖాస్తుల ఎంట్రీలు చేయిస్తున్నామన్నారు. ఈ పరిశీలనలో ఏఎంసీ కృష్ణ, ప్రాజెక్టు అధికారి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతం



చందానగర్: చందానగర్ గంగారంలోని జగద్రక్షక శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కమలాకర్‌శర్మ వ్రత విధానాన్ని వివరించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

బచ్‌పన్‌లో సైన్స్ ఫెయిర్



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న స్కూల్ డైరెక్టర్ సీహెచ్.శ్రీనివాస్‌రావు తదితరులు

గచ్చిబౌలి: మాదాపూర్ బచ్‌పన్ హైట్స్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఇందులో విద్యార్థులు తయారుచేసిన వివిధ ప్రాజెక్టులను ప్రదర్శనకు ఉంచారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా పిల్లల్లోని సృజనాత్మకత బయటపడుతుందని స్కూల్ డైరెక్టర్ సీహెచ్.శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుద్రహోమం



సాయిదత్త గణపతి ఆలయంలో రుద్రహోమం

రాయదుర్గం: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో ఆదివారం రుద్రహోమం నిర్వహించారు. ఉదయం ఆలయంలో గణపతి పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. శివయ్యకు 21 ద్రవ్యాలతో విశేష అభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. తర్వాత పూర్ణాహుతి జరిపారు. పండిత ఆశీర్వచన కార్యక్రమం అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు.

మెరిడియన్ స్కూల్‌లో 'ప్రజ్వల్'



మాదాపూర్: మాదాపూర్ మెరిడియన్ స్కూల్ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రజ్వల్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ఫౌండర్ బుట్టారేణుక, సీఈఓ తేజస్వీని, అమోఘ్, ప్రిన్సిపల్ కరణం భవాని పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



శేఖర్ (ఫైల్)

గచ్చిబౌలి: స్నేహితుని బర్త్ డే ఉందని చెప్పి వెళ్లిన ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేష్‌గౌడ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బైల్దర్‌హిల్స్‌లో వాచ్‌మెన్‌గా పని చేసే రామకృష్ణ కొడుకు కె.శేఖర్ గాజులరామారంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కొద్ది రోజుల క్రితం తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. ఈ నెల 6న సాయంత్రం 5 గంటలకు ఫ్రెండ్ బర్త్‌డే ఉందని చెప్పి ఖాజాగూడ బయలుదేరాడు. రాత్రి 11.30 గంటలకు తన వద్ద ఉన్న ఫోన్‌ను స్నేహితులకు ఇచ్చి కాలేజీకి వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. శేఖర్ కాలేజీకి వెళ్లలేదని, ఎక్కడికి వెళ్లాడో తెలియడం లేదని తండ్రి గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఎం సభలను విజయవంతం చేయాలి

ఆల్విన్‌కాలనీ: నిజాంపేట్ ప్రగతినగర్ లీలాసుందరయ్య ఫంక్షన్ హాలులో డిసెంబర్ 7, 8 తేదీల్లో జరిగే మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని హనుమాన్‌నగర్ బస్తీలో సీపీఎం నాయకులు ప్రచారం చేశారు. సీపీఎం కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం శంకర్, కూకట్‌పల్లి శాఖ కార్యదర్శి పి.ధర్మారావు, సభ్యులు కె. నర్సమ్మ, ఖాసింలు ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు.